## క్లుప్తంగా

### గ్రీటింగ్ కార్డ్స్ తయారీ పోటీలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసే వివిధ రకాల గ్రీటింగ్ కార్డ్స్ తయారీ పోటీలను నిర్వహించారు. నూతన ఆలోచనలతో కార్డ్స్ రూపొందించే విధంగా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమలోని సృజనాత్మకతతో, నూతన భావాలతో గ్రీటింగ్ కార్డ్స్ తయారు చేశారు. పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి కె. రమాదేవి తెలిపారు. అనంతరం పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు.

### నేడు వీఎంసీ కార్యాలయాల్లో ‘ప్రజాఫిర్యాదులు- పరిష్కారం’

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వీఎంసీ కల్పిస్తున్న మౌలిక వసతుల కల్పనలో సమస్యలను ప్రజల నుంచి తెలుసుకునేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయం, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

### ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌లో పాల్గొన్న డాక్టర్ లీలావతి



పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకురాలిగా పని చేస్తున్న డాక్టర్ పామర్తి లీలావతి పాటియాలాలోని పంజాబ్ యూనివర్సిటీలో శనివారం నుంచి మూడు రోజుల పాటు జరిగిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 83వ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సమావేశంలో చరిత్ర గురించి ప్రసంగించడం సంతోషంగా ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన పంజాబ్ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి హరిజోత్ సింగ్ బైన్స్‌ను కలవడం ఆనందంగా ఉందన్నారు. కాగా తను పంజాబ్ యూనివర్సిటీ విద్యార్థినని ఆమె తెలిపారు.

### వడియ రాజులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఏపీ వడియరాజుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి



అజిత్‌సింగ్ నగర్(విజయవాడసెంట్రల్): వడ్డెర, వడియ రాజులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వడియరాజుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబిరాణి డిమాండ్ చేశారు. సింగ్‌నగర్ నందమూరినగర్‌లోని తన కార్యాలయంలో ఆదివారం ఆ సంఘ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. స్వాతంత్ర్య సమర యోధుడు ఓబన్న జయంతిని జనవరి 11వ తేదీన ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అలానే టీటీడీ, అన్నవరం, శ్రీశైలం వంటి దేవస్థానాల్లో వడ్డెర్లను పాలక మండలి చైర్మన్లు, బోర్డు డైరక్టర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. వడ్డెర, వడియ రాజులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేసేలా చూడాలని, లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఏపీ వడియరాజుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల శివ, గౌరవ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు బత్తుల ఈశ్వరి, రాష్ట్ర నాయకులు వేముల మల్లేశ్వరరావు, కొమెర వీరాంజనేయులు, ఈర్ల రవిచంద్ర, ఓర్సు బాల వీరాస్వామి, ఒంటిపులి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం హైదరాబాద్ కోకాపేటకు చెందిన ధూళిపాళ్ల అపర్ణ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ఆరుషి, యామిని, ఐశ్వర్య, సురభి, శ్రీనిక, అనన్య, శ్రీకృతి, సహస్ర, నిత్యశ్రీ పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచ హారతుల సేవ అనంతరం కళావేదికపై జరుగుతున్న నృత్య ప్రదర్శనను భక్తులు ఆసక్తితో వీక్షించారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

# రాకపోకల పునరుద్ధరణ ఎన్నటికో.!

- మరమ్మతులకు నోచుకోని బుడమేరుకు గండి పడిన రోడ్డు ప్రాంతం
- ప్రమాదకరంగా ప్రయాణాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయదుర్గానగర్, కేఎల్‌రావు నగర్, బుడమేరు మధ్యకట్ట వాసులకు బుడమేరు వరద కష్టాలు నేటికీ తొలగలేదు. నిత్యం రద్దీగా వేలాది మంది రాకపోకలు సాగించే బుడమేరు మధ్యకట్టలో వరద సమయంలో బుడమేరు ఏలూరు కాలువ మధ్య గండి పడింది. గండి పడి నాలుగు నెలలు కావస్తున్నా ఇంత వరకు కనీస మరమ్మతులు కానీ.. రోడ్డును వేయడం కానీ చేయలేదు. దీంతో విజయదుర్గానగర్, కేఎల్‌రావు నగర్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నిరుపేద వర్గాల ప్రజలు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో గండిని పూడ్చకపోవడంతో రాకపోకలకు నానాయాతన పడుతున్నారు. విజయదుర్గానగర్ నుంచి బుడమేరు వంతెన వద్దకు చేరుకోవాలంటే చుట్టూ తిరిగి దేవీనగర్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో విలువైన సమయంతో పాటు ఇంధనం కూడా వృథా అవుతుంది. అత్యవసర సమయాల్లో సైతం గండి వల్ల తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బుడమేరుకు గండి పడిన ప్రాంతంలో కొట్టుకుపోయిన రోడ్డు



ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్న ద్విచక్రవాహనం

#### మట్టి పోసి వదలివేశారు

గండిపడిన ప్రాంతంలో ఒక పక్కన కేవలం కొద్దిపాటి మట్టి పోసి వదలివేశారు. దగ్గరి దారి కావడంతో ప్రమాదకరంగా ఉన్నప్పటికీ మట్టి పోసిన ప్రాంతం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో పలువురు వాహనదారులు జారి కింద పడిపోతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానికులు తాత్కాలికంగా కర్రలతో దడి కట్టారు. నెలలు గడుస్తున్నా రోడ్డును వేయకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బుడమేరు గండిపడిన ప్రాంతంలో రోడ్డు దుస్థితి

#### అధికారుల సమన్వయ లోపం

ఇక్కడ గండి పడిన ప్రాంతాన్ని సరిచేసి రాకపోకలు సాగించాలంటూ స్థానికులు పలు మార్లు ఫిర్యాదులు చేశారు. అయితే దీనిపై ఇరిగేషన్ అధికారులు నగరపాలకసంస్థ వారు మరమ్మతులు చేయాలని చెబుతున్నారు. నగరపాలకసంస్థ వారేమో ఇరిగేషన్ అధికారులే చేయాలని ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ కాలయాపన చేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో రాకపోకలకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. దీనిపై ఇప్పటికే సీపీఎం పార్టీ ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేయడంతో పాటు సంతకాలు సేకరించి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం కూడా అందజేశారు.



సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నేతలు (ఫైల్)

#### కలెక్టర్ సారూ కరుణించలేదు



పేదలపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏ పాటిదో ఇక్కడ రోడ్డును చూస్తే అర్థం అవుతుంది. నాలుగు నెలలు కావస్తున్నా కనీసం రాకపోకలు పునరుద్ధరించలేదు. ఇప్పటికే ఇక్కడ నిరసన ధర్నా నిర్వహించి సంతకాలు సేకరించి జిల్లా కలెక్టర్‌కు అందజేశాం. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు.

– గంగాద వెంకటేశ్వరరావు, సీపీఎం డివిజన్ సెక్రటరీ

#### చుట్టూ తిరిగి వెళ్లాలి



అత్యంత సమీపంలో ఉండే బుడమేరు వంతెనకు వెళ్లాలంటే మధురానగర్ వంతెన మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. తోపుడు బండ్లు సైతం తీసుకువెళ్లేందుకు అవస్థలు పడాల్సి వస్తుంది. అధికారులు సత్వరమే రోడ్డును నిర్మించి రాకపోకలు పునరుద్ధరించాలి.

ఆర్ రామారావు, చిరు వ్యాపారి

#### తీవ్ర ఇబ్బందులు



బుడమేరు వరద వచ్చి నాలుగు నెలలు గడిచినా గండిని మాత్రం సరిచేయలేదు. దీంతో కనీసం పక్కనే ఉన్న మధ్య కట్టలో కేఎల్‌రావు నగర్‌కు వెళ్లాలన్నా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ఈ ప్రాంతం నుంచి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

షకీలా, బుడమేరు మధ్యకట్ట

### కనుల పండువగా అయ్యప్పస్వామి పడిపూజ



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని గాయత్రి ఫంక్షన్ హాలులో అయ్యప్పస్వామి మహా పడిపూజ ఆదివారం సాయంత్రం పసుమర్తి శివకుమార్ బృందంచే కనుల పండువగా జరిగింది. అష్టాదశ కలశాలతో అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. 18 మెట్లు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి అయ్యప్ప, గణపతి, కుమార స్వామి విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లగా గాయత్రీ కల్యాణ మండపంలో అయ్యప్ప పడిపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలదారులు పాల్గొన్నారు.

### శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తతో ఉండాలని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఆదివారం ఆయన స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లుకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీ, సస్పెక్ట్ షీటర్లపై పోలీసుల నిఘా ఉంటుందని, వారు సత్ప్రవర్తక కలిగి కుటుంబంతో సంతోషంగా ఉండాలని సూచించారు.

## కర్మల భవనానికి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. సీకే రెడ్డి రోడ్డులో శిథిలావస్థకు చేరిన కర్మల భవనానికి మరమ్మతు పనులు ప్రారంభించారు. ఇక్కడ కర్మల భవనం పరిస్థితులను వివరిస్తూ సాక్షి శిథిలావస్థలో కర్మల భవనం పేరిట ఈనెల 16వ తేదీన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు కర్మల భవనాన్ని పరిశీలించి ఎస్టిమేషన్ తయారు చేశారు. మరమ్మతు పనులను కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్ధేశించిన సమయంలో పనులు పూర్తిచేయాలని సూచించారు. సాధ్యమైనంత త్వరలోనే మరమ్మతులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.



టాయిలెట్లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

## శాఖాభేదాలు లేకుండా వివాహాలు నిశ్చయం చేసుకోవాలి

బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు బలరామకృష్ణమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శాఖాభేదాలు లేకుండా తమ పిల్లల వివాహాలు నిశ్చయం చేసుకోవాలని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి తల్లిదండ్రులకు సూచించారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్యనారాయణపురంలోని శ్రీసీతారామకల్యాణ మండపంలో 43వ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులు సకాలంలో తమ పిల్లలకు వివాహం జరిగేలా చూడాలని కోరారు. తల్లిదండ్రులను ముఖాముఖి పరిచయం చేసి వివాహాలు నిశ్చయం చేసుకోవడానికి ఈ పరిచయ వేదిక ఎంతో తోడ్పడుతుందన్నారు. ఉన్నతమైన, ఆదర్శవంతమైన విలువలతో వివాహాలు చేసుకోడానికి బ్రాహ్మణ సేవా సంఘం పూర్తి సహకారం అందిస్తున్నదని తెలిపారు. ఈ వేదికలో 410 దరఖాస్తులు రాగా వాటిలో 15 సంబంధాలు నిశ్చయం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఈవని శ్రీరామచంద్రమూర్తి, సీతంరాజు రాజశేఖర్, కొప్పరపు మారుతి, యద్దనపూడి శ్రీరామచంద్రమూర్తి, గుడిపాటి మురళీకృష్ణ, పింగళి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికలో మాట్లాడుతున్న బలరామకృష్ణమూర్తి

## రాష్ట్రంలో క్రీడలకు కష్టకాలం

ఏపీఓఏ అధ్యక్షుడు పురుషోత్తం

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో క్రీడలకు కష్టకాలం వచ్చిందని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ (ఏపీఓఏ–రిజిష్టర్ నంబర్ 569/2016) అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 38వ జాతీయ క్రీడలు ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జనవరి 28వ తేదీన ప్రారంభమై ఫిబ్రవరి 14న ముగుస్తాయన్నారు. ఈ క్రీడలకు జట్లను తీసుకెళ్లాల్సిన బాధ్యత ఏపీఓఏ పైనే ఉందని చెప్పారు. ఈ ఏడాది క్రీడలకు సంబంధించి రూ. 31.50 లక్షలు ఖర్చవుతుందని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని, సాయం చేసేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

**జట్లను తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు**

కాగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఆర్.కె.పురుషోత్తంనకు ఏపీఓఏకు ఎలాంటి సంబంధం లేదని ఏపీఓఏ (రిజిష్టర్ నంబర్–175/1961) కార్యదర్శి కె.పి.రావు అన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కె.పి.రావు మాట్లాడారు. ఏటా జాతీయ క్రీడలకు ముందు ప్రభుత్వాలను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు తీసుకుని జల్సాలు చేయడం అతనికి అలవాటుగా మారిందని విమర్శించారు. ఈ ఏడాది అతని ఆటలు సాగనివ్వబోమని, జట్లను రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లో శాప్ తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు. క్రీడలపై అవగాహన లేకుండా క్రీడా సంఘాల వ్యవహారాల్లోకి చొరబడ వద్దని టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు కె.పి.రావు సూచించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కె.పురుషోత్తం

## ‘మునిసిపల్’ సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలి

పటమట(విజయవాడతూర్పు): మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగులు సంఘటితమైతేనే ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దొప్పలపూడి ఈశ్వర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అసోసియేషన్ హాల్లో ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్‌పై అందరికీ అవగాహన ఉండాలని, మున్సిపల్ శాఖలో సిబ్బంది సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం కదిలేలా ఉద్యోగులు ఒత్తిడి తీసుకురావాలన్నారు. సంఘ వీఎంసీ అధ్యక్షుడు తిమ్మసర్తి నాగేశ్వరరావు, ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.శివరాం ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, వీరభద్రయ్య, దేవరాయలు, కోశాధికారి ఎం.రవి, సెక్రటరీ కళ్యాణ్ చక్రవర్తి, రవిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గాలి సుధాకర్, జాయింట్ సెక్రెటరీ రాజేష్, ప్రదీప్ కుమార్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా శారద కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

పూర్వ అధ్యాపకులు, విద్యార్థులకు సత్కారం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శారద కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. గోల్డెన్ జూబ్లీని పురస్కరించుకొని ఆదివారం కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గత యాభై ఏళ్లలో కళాశాలలో చదువుకొని ఉన్నత స్థానాల్లో ఉన్న వారంతా హాజరయ్యారు. వారంతా తాము చదువుకున్న కళాశాలకు వచ్చి ఒక్కసారిగా తమ కళాశాల మధురస్మృతులను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ.. రోజంతా ఉల్లాసంగా గడిపారు. కళాశాల గోల్డెన్ జూబ్లీ సందర్భంగా జరిగిన సమావేశంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి, చార్టెడ్ అకౌంటెంట్ కుందా రామనారాయణ ఆధ్వర్యంలో కళాశాల పూర్వ అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. అలాగే విద్యార్థులకు కూడా 50 ఏళ్ల గుర్తుగా జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. 1974వ సంవత్సరం తొలి బ్యాచ్ నుంచి ప్రస్తుత బ్యాచ్ వరకు ప్రతి ఒక్క బ్యాచ్‌ను సత్కరించారు.





గోల్డెన్ జూబ్లీ సందర్భంగా అధ్యాపకుడిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

**1974లో కళాశాల ప్రారంభం**

ఈ సందర్భంగా రామనారాయణ మాట్లాడుతూ శారద కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు అనూహ్య స్పందన వచ్చిందన్నారు. వెయ్యి మందికి పైగా పూర్వ విద్యార్థులు, 200 మందికి పైగా అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. కళాశాల 1974లో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అద్దె భవనంలో ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం ఆధునిక వసతులతో సకల సౌకర్యాలతో నూతన భవనాలు ఏర్పాటయ్యాయన్నారు. విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన కోర్సులను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. కోర్సు పూర్తి కాగానే ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో క్యాంపస్ ప్లేస్‌మెంట్ సెల్ ప్రారంభించామని తెలిపారు. రానున్న కాలంలో విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ఆర్.డి.షా, ఉపాధ్యక్షుడు లింగమూర్తి, శారద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వరశర్మ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీధర్, శారద స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.ఎల్.ఎన్.మూర్తి, సొసైటీ ట్రెజరర్ ఎస్.వి.ఎస్. వరప్రసాద్, సొసైటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా ఈత పోటీలు









నగరంలోని సర్ విజ్జి మునిసిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్‌పూల్‌లో ఈత పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం దక్షిణ భారత స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ ముగిసింది. పోటీల్లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులు ప్రతిభ చూపారు. సీనియర్స్, జూనియర్స్ వారి విభాగాల్లో సత్తా చాటారు. వాటర్ పోలో పోటీలు సందడిగా సాగాయి. స్థానికులు పెద్ద సంఖ్యలో ఈత పోటీలను వీక్షించారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

### 12న పూర్వ విద్యార్థుల సమావేశం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం వచ్చేనెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ చిన్నం ప్రసాద్ తెలిపారు. పాఠశాల ఆవరణలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం ఈ సమావేశాల గోడపత్రిక, ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. శ్రీ రామకృష్ణ సమితి జాయింట్ సెక్రటరీ పి.అప్పలరాజు, హెచ్ఎం ఎస్. నరేంద్ర, సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు బద్రీ నారాయణ, రాజశేఖర్, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆంగ్ల విద్య రద్దుకు కుట్ర

– డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ఇటీవల కొందరు ఉద్దేశపూర్వకంగా రద్దు చేయాలని చూస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్యుల విభాగం చైర్మన్ డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. తెలుగు భాషను పరిరక్షించాలనే ముసుగులో వెనుకబడిన తరగతుల వారికి ఆంగ్ల విద్యను దూరం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. సాంకేతిక రంగాల్లో మెరుగైన అవకాశాలను పొందేందుకు ఆంగ్ల మాధ్యమ విద్య చాలా కీలకమని పేర్కొన్నారు. ఆంగ్ల విద్యను రద్దు చేసే చర్య ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఇది ఇప్పటికే ఉన్న అసమానతలను మరింత తీవ్రతరం చేస్తుందని విచారం వ్యక్తం చేశారు. తెలుగు భాష, సంస్కృతిని కాపాడుకోవడానికి తెలుగు సాంకేతిక విద్యా పుస్తకాలను ప్రవేశపెట్టడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిరుపేద వర్గాలకు ఆంగ్ల విద్యను దూరం చేయడం కంటే తెలుగు భాష, సంస్కృతిని పెంపొందించడానికి మేధావులు వినూత్న పరిష్కారాలను కనుక్కోవాలని సూచించారు.